క్లుప్తంగా...

సమష్టి కృషితో అభివృద్ధి చేద్దాం



కమిషనర్‌ను సత్కరిస్తున్న పాలకవర్గం

బోడుప్పల్: అధికారులు, పాలకవర్గం సమష్టి కృషితో అభివృద్ధిని చేద్దామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. నూతన కమిషనర్‌గా వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పాలకవర్గం పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అనంతరం ఆయనను సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో అభివృద్ధి విషయంలో ఇబ్బంది పడ్డామని, ఇక నుంచి అత్యవసర పనులను గుర్తించి ఆ పనులను సత్వరం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



రమేష్‌నాయుడు

మేడిపల్లి: ఉప్పల్ విశ్వహిందూ పరిషత్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ముక్తానాగ రమేష్ నాయుడు, కార్యదర్శిగా తూడి ముక్తేశ్వర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా భీమనేని స్వామి, సికింద్రాబాద్ విభాగ్ సహ కార్యదర్శిగా రాఘవేంద్రర్, ప్రాంత అధ్యక్షులుగా సుధాకర్, ప్రాంత కార్యదర్శిగా పండరీనాథ్ శాలివాహన నియమితులయ్యారు.

లక్ష్మీనారాయణనగర్ అధ్యక్షుడిగా లూకాస్



రామంతాపూర్: ఉప్పల్ ఐడీఏలోని లక్ష్మీనారాయణనగర్ కాలనీ సంక్షేమ ఎన్నికల్లో పసల లూకాస్ తన ప్రత్యర్థిని 36 ఓట్ల ఆధిక్యంతో ఓడించి అధ్యక్ష పదవిని కైవసం చేసుకున్నారు. లూకాస్ నాలుగు సంవత్సరాలుగా లక్ష్మీనారాయణ కాలనీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. లూకాస్ మాట్లాడుతూ నాపై విశ్వాసంతో తిరిగి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. లక్ష్మీనారాయణనగర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశానవాటికలో వసతులు కల్పిస్తా



కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మర్రిగూడ కాలనీలో శ్మశానవాటికలో వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి మర్రిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. శ్మశానవాటికలో వసతులు కల్పిస్తానని కాలనీవాసులు హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

శుభాకాంక్షలు



ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

గౌతంనగర్: తెలంగాణ బీజేపీ ఎలక్షన్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఈటల రాజేందర్‌ను సోమవారం గౌతంనగర్‌కు చెందిన బీజేపీ నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ ముదిరాజ్, ధన్‌రాజ్, మాశెట్టి అనిల్‌గుప్తా, గణేష్ తదితరులు ఉన్నారు.

నియామకం



సుమంత్

కుషాయిగూడ: బజ్‌రంగ్‌దళ్ మహంకాళి విభాగ్ కో కన్వీనర్‌గా కుషాయిగూడకు చెందిన ముప్ప సుమంత్ నియమితులయ్యారు. ఘట్‌కేసర్‌లోని రాష్ట్రీయ విద్యాకేంద్రంలో జరిగిన విశ్వ హిందు పరిషత్ సమావేశంలో ఆయనను నియమిస్తూ వీహెచ్‌పీ ప్రాంత కార్యదర్శి పండరీనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

మల్లికార్జునగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. సోమవారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జునగర్‌లో రూ.24 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్ కాలనీ వ్యూ



దేవేందర్‌నగర్ గుట్ట.. కబ్జాదారుల అడ్డా..

నాలుగు రౌడీ గ్యాంగ్‌లు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న దేవేందర్‌నగర్ గుట్టపై రౌడీల రాజ్యం నడుస్తోంది. స్థానికంగా ఉండేవారు గ్యాంగ్‌లుగా ఏర్పడి ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా స్థానిక ప్రజలు ప్రశ్నిస్తే వారిపై భౌతిక దాడులకు దిగుతున్నారు. ఇక్కడ జరిగే వ్యవహారాలపై అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇక్కడ జరిగే అన్ని పనులకు అధికార పార్టీకి చెందిన ఓ మహిళా కార్పొరేటర్ భర్తే సూత్రదారి. అధికారులు, పాలకవర్గం మాట చెల్లుబాటు కాదు. ఇక్కడ వారు చెప్పిందే వేదం. బోడుప్పల్‌లో ఉన్న 28 డివిజన్లు ఒక ఎత్తయితే.. ఈ ఒక్క డివిజన్ మాత్రం మరో ఎత్తు.

- ఖాళీ ప్లాట్ కనిపిస్తే వాలుతున్న వైనం
- గ్యాంగ్‌లకు బాస్ ఓ కార్పొరేటర్ భర్తే..
- ఎవరికి ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం
- పట్టించుకోని అధికారులు, పాలకవర్గం
- కాలనీవాసులు ప్రశ్నిస్తే భౌతికదాడులు
- పెద్దఎత్తున ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సెలవు దినాల్లో నిర్మాణాలు..

ఇక్కడ సదరు రౌడీ గ్యాంగ్ సెలవు దినాల్లో రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతోంది. వరుసగా రెండు రోజులు సెలవులు వస్తే రాత్రి పూట నిర్మాణాలు చేపట్టి, సోమవారం ఉదయం వరకు రంగులు వేస్తున్నారు. ఎవరైనా సెంట్ ప్రభుత్వ భూమిని కబ్జా చేసినా ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెట్టే రెవెన్యూ అధికారులు ఇక్కడ మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కేసులు పెట్టకుండా అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే ఇక్కడ రౌడీ గ్యాంగ్‌లు, ఆ కార్పొరేటర్ భర్త ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పేదలకు ఇచ్చిన పట్టాల్లో వారికి న్యాయం జరిగేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇళ్లు కట్టుకోనివ్వని అధికారులు..

బోడుప్పల్‌లోని సర్వే నంబరు 63/1లోని ప్రభుత్వ స్థలంలో గత ప్రభుత్వాలు లేఅవుట్ చేసి పేద ప్రజలకు పట్టాలు ఇచ్చింది. అందులో అంబేద్కర్‌నగర్, దేవేందర్‌నగర్ ఫేస్–1, 2, రాజీవ్‌నగర్ ఫేస్ 1, 2 కాలనీలు వెలిశాయి. పట్టాలు పొందిన పేద ప్రజలు కొంత మంది ఆర్థిక స్తోమత లేక సకాలంలో ఇళ్లు నిర్మించుకోలేదు. పట్టా పొందిన ఆరు నెలలలోపు ఇళ్లు నిర్మించుకోకపోతే రద్దు అవుతుందని రెవెన్యూ అధికారులు చెబుతూ ప్రస్తుతం ఉన్న స్థల యజమానులను ఇళ్లు కట్టుకోనివ్వడం లేదు. కొంత మంది పట్టాలు పొందిన వారు ఆర్థిక అవసరాల నిమిత్తం తమ పట్టాలను నోటరీల రూపంలో ఇతరులకు విక్రయించారు.

- సర్వే నంబరు 63/28 నుంచి 63/39లో గౌతమినగర్, సీతారాంనగర్, అంబేద్కర్ నగర్ ఫేస్–3 కాలనీలు వెలిశాయి. వీటి విషయంలో ప్రభుత్వ స్థలమని అధికారులు చెబుతుండగా, ఇది ప్రైవేట్ స్థలమని కొంత మంది వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. దీంతో సదరు స్థలం విషయం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది.

నకిలీ పట్టాలు సృష్టిస్తున్న గ్యాంగ్..

బోడుప్పల్‌లోని అంబేద్కర్‌నగర్, దేవేందర్‌నగర్ ఫేస్–1లో 90శాతం ఇళ్లు నిర్మించుకున్నారు. దేవేందర్‌నగర్ ఫేస్–2, రాజీవ్‌నగర్ ఫేస్–1, 2, సీతారాంనగర్, అంబేద్కర్‌నగర్ ఫేస్–3, గౌతమ్‌నగర్ కాలనీల్లో ఖాళీ స్థలాలున్నాయి. ఇక్కడ ఉన్న రౌడీ గ్యాంగ్‌లు సదరు స్థలాల్లోని ఖాళీ ప్లాట్లకు నకిలీ నోటరీలు సృష్టిస్తున్నారు. అసలు స్థల పట్టా యజమాని ఎవరూ రాకపోతే 60 గజాల స్థలాన్ని రూ.15 లక్షలకు విక్రయించి వారే దగ్గర ఉండి కట్టిస్తున్నారు. ఎవరైనా ఈ ప్లాట్ తమదని వస్తే రూ.2 నుంచి రూ.3 లక్షలు ఇచ్చి వెళ్లిపోవాలంటున్నారు. ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే సివిల్ మ్యాటర్ బయట మాట్లాడుకోవాలని, లేకపోతే కోర్టుకు వెళ్లమని పోలీసులు సలహా ఇస్తున్నారు. దీంతో అసలు పట్టాదారు, నకిలీ పట్టాదారు ఇద్దరు కలిసి సదరు మహిళా కార్పొరేటర్ భర్త వద్దకు వెళ్తున్నారు. ఇద్దరికీ పట్టాలు ఉన్నాయి.. కాబట్టి చెరి సగం తీసుకోమని చెబుతున్నారు.

ఇళ్ల నిర్మాణానికి అనుమతించని అధికారులు

ప్రభుత్వం నుంచి పట్టాలు పొందిన వారు, సదరు పట్టాలు కొనుగోలు చేసిన వారిని ఇళ్లు కట్టుకునేందుకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అనుమతించడం లేదు. దీన్ని అదనుగా భావించిన సదరు మహిళా కార్పొరేటర్ భర్త, గుట్టపై ఉన్న రౌడీ గ్యాంగ్‌లు తాము కట్టిస్తామంటూ రంగ ప్రవేశం చేస్తున్నారు. 60 గజాల స్థలంలో ముందుండి వారు కట్టించేందుకు రూ.3 నుంచి రూ.4 లక్షలు వసూలు చేస్తున్నారు. అదే అండర్ డ్రైనేజీ కలిపేందుకు, నల్లా కనెక్షన్ ఇచ్చేందుకు రూ.25 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేస్తున్నారు. ఇవ్వని వారు ఎవరైనా ఉంటే వారిపై భౌతికంగా దాడులు చేస్తూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు.

మహిళా సాధికారితకు రాష్ట్ర ప్రభుత్వం కృషి



స్వప్నకు నూనె ఉత్పత్తి చేసే యంత్రాన్ని అందజేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మహిళా సాధికారితకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం బోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో మల్కాజిగిరి రిసోర్స్ పర్సన్ స్వప్నకు తనవంతు సాయంగా మంజూరు చేసిన నూనె ఉత్పత్తి చేసే యంత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బోర్డ్ మాజీ సభ్యులు పాండుయాదవ్, సందీప్‌గౌడ్, నరేష్, అజయ్‌యాదవ్, ప్రవీణ్ యాదవ్, రాజుసింగ్, నరేష్, చంద్రకళ, మహేందర్ తదితరులు ఉన్నారు.

మాజీ మేయర్‌ను కలిసిన గౌడసంఘం ప్రతినిధులు



మాజీ మేయర్ బొంతు రాంమోహన్ దంపతులను కలిసిన గౌడసంఘం ప్రతినిధులు

కుషాయిగూడ: నూతనంగా ఎన్నికైన చర్లపల్లి డివిజన్ నూతన గౌడ సంఘం ప్రతినిధులు సోమవారం మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను వారు అభినందించి ఘనంగా సత్కరించారు. అనంతరం గౌడ సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన బొంతు రాంమోహన్ గౌడ సంఘం అభివృద్ధితో పాటు సంఘం ప్రతినిధులకు అందుబాటులో ఉంటూ కావాల్సిన సహకారం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో గౌడసంఘం చర్లపల్లి అధ్యక్షుడు ఆనంద్‌రాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రుద్రగోని రాంచందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు నరసింహ, అశోక్, సభ్యులు రాములు, శశికుమార్, ప్రభుగౌడ్, బాబుగౌడ్, ప్రభాకర్‌గౌడ్, రజనీకాంత్‌గౌడ్, నాదంగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీరాములుగౌడ్ పాల్గొన్నారు.

బతికి ఉన్న వ్యక్తి మృతి చెందినట్లు సోషల్ మీడియాలో పోస్టు

అల్వాల్: బతికి ఉన్న వ్యక్తి మృతి చెందినట్లుగా పేర్కొంటూ సోషల్ మీడియా పోస్టింగ్ చేసిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికంగా వివాదస్పదంగా మారిన ఈ ఘటనకు సంబంధించిన పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ మచ్చబొల్లారం ప్రాంతానికి చెందిన గణేష్, అనిల్ బంధువులు. వీరి మధ్య చోటుచేసుకున్న ఆర్థిక లావాదేవీలే సోషల్ మీడియాలో పోస్టింగ్‌లకు కారణమయ్యామని పోలీసుల ప్రాథమికంగా నిర్ధారించారు. గణేష్ స్నేహితులతో కలిసి ఈ నెల 9వ తేదీన శ్రీశైలం వెళ్లాడు. అనంతరం అతడి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఇదే అదనుగా భావించిన అతడి దూరపు బంధువు అనిల్ సోషల్ మీడియాలో గణేష్ మృతి చెందాడంటూ పోస్ట్ పెట్టాడు. దీంతో గణేష్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గణేష్ భార్య కుప్పకూలిపోవడంతో ఆమెను స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. గణేష్, అనిల్ మధ్య కొంతకాలంగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించి తరచూ గొవడలు జరుగుతున్నాయని, ఈ మధ్య ఈ గొడవలు తారాస్థాయికి చేరుకున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. గణేష్ తిరిగి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. అనిల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



సమీక్ష నిర్వహిస్తున్న జోనల్ కమిషనర్ పంకజ

కాప్రా: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ అన్నారు. కాప్రా సర్కిల్‌లో వార్డు కార్యాలయాల పనితీరుపై సోమవారం సర్కిల్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. వార్డు ఆఫీస్‌లలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులపై ఆరా తీశారు. సమస్యలపై ఫిర్యాదులు వస్తే నిర్లక్ష్యం చేయవద్దని జెడ్సీ సూచించారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్, అధికారులు అశోక్‌రెడ్డి, ప్రసాద్, రాజ్‌కుమార్, హరిలాల్, స్వప్నారెడ్డి, శ్రీధర్‌ప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాయినగర్ కాలనీ వాసులు

కాప్రా: సాయినగర్ కాలనీలో నెలకొన్న సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. సోమవారం కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో మురుగు రోడ్లపై పారుతూ తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందన్నారు. సీసీ రోడ్లు మరమ్మతులకు గురై కాలనీల్లో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తాగునీటి సమస్య కూడా నెలకొందని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. స్పందించిన కార్పొరేటర్.. సంబంధిత అధికారులతో మాట్లాడానని, త్వరితగతిన సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

తల్లి మందలించడంతో ఇంట్లోంచి వెళ్లిపోయిన చిన్నారులు

24 గంటలలోపే పిల్లలను తల్లి చెంతకు చేర్చిన పోలీసులు

అల్వాల్: చదువుకోవాలని తల్లి మందలిస్తే ఇంట్లో నుంచి పారిపోయిన ఇద్దరు బాలికలను పోలీసులు 24 గంటలలోపే తల్లి వద్దకు చేర్చారు. నేరేడ్‌మెట్ సీఐ నాగరాజు వివారల ప్రకారం.. నేరేడ్‌మెట్ సంతోషిమానగర్‌లో నివాసముండే గాయత్రికి ఇద్దరు కుమార్తెలు. కొత్తపుట్ట ఇందు(13), లికిత(06) వీరు మాల్కాజిగిరిలోని బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. చదువుకోవడం లేదని తల్లి గాయత్రి మందలించడంతో 9వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో నుంచి పారిపోయారు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నేరేడ్‌మెట్ పోలీసులకు తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా సిద్దిపేట్ బాలసదన్‌లో బాలికల ఆచూకీ కనుగొన్నారు. గతంలో బాలసదన్‌లో వీరు విద్యను అభ్యసించినట్లు తెలిసింది. హాస్టల్‌లో వేస్తానని తల్లి బెదిరించడంతో తామే ఇంట్లో నుంచి వెళ్లామన్నారు. నేరేడ్‌మెట్ నుంచి జూబ్లీ బస్టాండ్ వరకు ఆటో, అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో వెళ్లినట్లు తెలిపారు. తప్పిపోయిన 24 గంటలలోపు తిరిగి బాలికలను తల్లికి అప్పగించడంపై ఉన్నతాధికారులు నేరేడ్‌మెట్ పోలీసులను అభినందించారు.

వీధి కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

ఉప్పల్: వీధి కుక్కలు వెంట పడటంతో తప్పించుకునేందుకు ప్రయత్నించిన వ్యక్తి గాయాలపాలైన ఘటన ఉప్పల్‌లో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఉప్పల్ మెట్రో షాపింగ్ మాల్ వెనుక రాజ్ నగర్ కాలనీకి బంధువుల ఇంటికి మూసాపేట నుంచి వచ్చిన నవీన్(35) ఆదివారం వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి వెళ్లే క్రమంలో వీధి కుక్కల గుంపు పొట్లాడుతూ ఇతడి వద్దకు పరుగులు తీసుకుంటూ వచ్చాయి. దీంతో భయంతో బైక్ పైనుంచి కింద పడి గాయాలపాలయ్యాడు. వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

12న విద్యాసంస్థలు బంద్

కాప్రా: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం ఈసీఐఎల్‌లోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. పలువురు మాట్లాడుతూ.. ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల దోపిడీని రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించడం లేదని మండిపడ్డారు. కార్పొరేటర్ విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ విద్యాసంస్థలపై నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంద్‌ను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. విద్యార్థి సంఘాల నాయకులు వెంకటేష్ రాథోడ్, సంతోష్, అన్వర్, అరుణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌ను నంబర్ వన్‌గా నిలిపాం



చిలుకానగర్‌లో పాదయాత్రలో సమస్యలను వివరిస్తున్న మహిళ

ఉప్పల్: మహానగరంలో ఉప్పల్‌ను నంబర్ వన్ స్థానంలో నిలిపినట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఆరు రోజులుగా డివిజన్ల వారీగా నిర్వహిస్తున్న పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన వస్తోందని ఆయన తెలిపారు. చిలుకానగర్ డివిజన్‌లో మూడు రోజులు పాదయాత్ర అనంతరం సోమవారం ఆదర్శ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప్పల్ రింగ్ రోడ్డు రూపురేఖలు మార్చిన ఘనతం బీఆర్‌ఎస్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన స్కైవాక్, థీమ్‌పార్కు, అంబేద్కర్ నాలేడ్జి పార్కు ఇలా అనేక విధాలుగా ఉప్పల్‌ను అభివృద్ధి పర్చినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో అన్ని డివిజన్లలో గర్వపడే విధంగా పనులు చేశామన్నారు. చిలుకానగర్ డివిజన్‌లో దాదాపుగా అన్ని పనులను పూర్తిచేసినట్లు తెలిపారు. చిన్న చిన్న సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చారని సాధ్యమైనంత త్వరలో వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పల్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేముల సంతోష్ రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు, గుడి మధుసూదన్‌రెడ్డి, జల్లి మోహన్, కాసం మహిపాల్‌రెడ్డి, పిట్టల నరేష్, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, స్థానికులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయ అధికారమే లక్ష్యంగా ప్లీనరి



అల్వాల్‌లో ప్లీనరీ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం ప్రతినిధులు

అల్వాల్: రాష్ట్రంలో మరో నాలుగు నెలల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు రాజకీయంగా అనుసరించాల్సిన విధానంపై చర్చించి, భవిష్యత్ రాజకీయ కార్యాచరణ ప్రకటించేందుకు ఈనెల 15వ తేదీన నగరంలోని ఎల్బీనగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో పదివేల మంది బీసీ ప్రతినిధులతో బీసీల రాజకీయ ప్లీనరి నిర్వహిస్తున్నట్లు బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ అన్నారు. సోమవారం అల్వాల్‌లో ఆయన బీసీ రాజకీయ ప్లీనరీకి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లీనరీలో వేలాది మంది పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ విద్యార్థి సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రమ్ రజక, మల్కాజిగిరి నియోజకవర్గ అధ్యక్షుడు గౌతమ్ ప్రజాపతి, యూత్ అధ్యక్షుడు నర్సింహయాదవ్, ప్రధాన కార్యదర్శి అక్షయ్ సింగ్, సెక్రటరీ అశ్విన్, ధనుష్, సంపత్, విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్



వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ జానకి, ఏసీపీ నరేష్‌రెడ్డి

మేడిపల్లి: తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.15.5 లక్షల విలువ చేసే 25తులాల బంగారు నగలు, వెండి వస్తువులు, ఆటో, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి జోన్ డీసీపీ జానకి, ఏసీపీ నరేష్‌రెడ్డి, సీఐ గోవర్ధనగిరితో కలిసి వివరాలు వెల్లడించారు. ఉప్పల్ అమృతకాలనీకి చెందిన రాపోల్ క్రిష్ణ(19), సంపంగి సాంబయ్య(37)స్థానికంగా సెంట్రింగ్ పని చేస్తున్నారు. వీరు 2022లో చోరీకి పాల్పడి జైలుకు వెళ్లి వచ్చారు. సులభంగా డబ్బులు సంపాదించాలని ఏప్రిల్ నెల నుంచి మళ్లీ చోరీలకు పాల్పడుతున్నారు. ఉదయం ఆటో, బైక్‌పై రెక్కీ నిర్వహించి తాళం వెసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని అర్ధరాత్రి కిటికీలు, వెంటిలేటర్ల గ్రిల్స్ తొలగించి ఇంట్లోని నగదు, నగలను అపహరించుకొని వెళ్తారు. ఇటీవల మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏడు ఇళ్లలో చోరీకి పాల్పడి తప్పించుకొని తిరుగుతున్నారు. సోమవారం చెంగిచెర్ల క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.15.5 లక్షల విలువ చేసే బంగారు, వెండి వస్తువులు, ఆటో, బైకు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడిపల్లి క్రైమ్ పోలీసులు పాల్గొన్నారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు సోమవారం ఏఈ ఎ.వెంకటరెడ్డి తెలిపారు. మీర్‌పేట 11 కేవీ ఫీడర్ పరిధిలోని మీర్‌పేట, తిరుమల నగర్, పార్ట్ ఆఫ్ శ్రీనగర్‌కాలనీ, ఎంఐజీ, తిరుమల నగర్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరంటు సరఫరా ఉండదన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సంక్షేమం



వెంకటాపురంలో పాదయాత్ర చేస్తున్న నందికంటి శ్రీధర్

అల్వాల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. కాలనీ నేస్తం–కాంగ్రెస్ హస్తంలో భాగంగా సోమవారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అభయ హస్తం కింద రూ.5 లక్షలు ఆరోగ్యశ్రీ, ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు, వంటగ్యాస్ సిలిండర్ రూ.500లకే అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మ అశోక్‌రెడ్డి, కృష్ణగౌడ్, శ్రీనివాస్, సంజీవ్‌కుమార్, పవన్, సూర్య ప్రకాష్‌రెడ్డి, శివశంకర్ కుమార్, సాయికుమార్, పద్మ, ఆషారాణి తదితరులు పాల్గొన్నారు.

కాప్రా తహశీల్దార్ కార్యాలయంలో నిర్లక్ష్య ధోరణి



కాప్రా తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

కాప్రా: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో కాప్రా తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానంద్ మండిపడ్డారు. సకాలంలో తాహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది, అధికారులు ప్రజలు దరఖాస్తు చేసుకున్న ధ్రువపత్రాలు జారీ చేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ సామాన్యులు అవస్థలు పడుతుంటే కాప్రా ఎమ్మార్వో ఆఫీసులో అధికారులు సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని ఇటీవల కాలంలోనే ఇలా ఎందుకు జరుగుతుందో ఉన్నతాధికారులే దృష్టిసారించాలని కోరారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. హరికృష్ణ, ఆనంద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.